## క్లుప్తంగా

### పెట్రోల్ బంక్ ప్రారంభం

గుడిపాల: మండల కేంద్రంలోని పెద్దదళవాయిపల్లె వద్ద పెట్రోల్‌బంక్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీ ఆధ్వర్యంలో బంక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో చీలాపల్లె వద్ద ఉన్న పెట్రోల్‌బంక్ చెన్నై–బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవేకి వెళ్లిపోయింది. ఇప్పుడు జాతీయ రహదారిలో మరో బంక్ ఏర్పాటు కావడంతో రహదారిలోని వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది.

### తవణంపల్లె ఎస్‌ఐగా చిరంజీవి



తవణంపల్లె: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా చిరంజీవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అనిల్‌కుమార్ చిత్తూరు ఎస్‌బీకి బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లా నుంచి చిరంజీవిని ఇక్కడికి బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన తవణంపల్లె ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. దళారులను నమ్మొద్దని ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనకు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని వివరించారు. మండలంలో పోలీసుల విధులకు ప్రజలు సహకరించాలని కోరారు.

### ఉపాధి పనులపై నేడు గ్రామ సభలు

ఐరాల: మండలంలోని 28 పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి పనులపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగే ఈ గ్రామ సభల్లో ప్రజలు పాల్గొని గ్రామంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి పథకం కింద చేపట్టబోయే పనులను గుర్తించాలన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఈ సభలను అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలని ఎంపీడీఓ ఆదేశించారు.

### నైపుణ్యాలు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు నైపుణ్యాలు ముఖ్యమని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు అన్నారు. గురువారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. నియోజకవర్గానికి త్వరలో అనువైన కంపెనీలు తీసుకురానున్నట్లు చెప్పారు. ఆ కంపెనీల్లో ఉద్యోగాలు విరివిగా కల్పించేందుకు చర్యలు చేపడుతామన్నారు. అనంతరం రెండు ప్రముఖ కంపెనీలు ఉద్యోగ మేళాను నిర్వహించి విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి, అధ్యాపకులు మీరాసాహెబ్, శరవణ, తదితరులు పాల్గొన్నారు.

### స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

కార్వేటినగరం: నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి స్కిల్ హబ్‌ను నియోజకవర్గంలో ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, కార్వేటినగరం ప్రిన్సిపల్ గణేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఇతర డిగ్రీలు కలిగిన స్థానిక నిరుద్యోగ యువతీయువకులకు డొమెస్టిక్ ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ అందించి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్ ఇప్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కార్యాలయ సిబ్బంది టి.అబ్దుల్‌ను 81425 09017 నెంబరుకు సంప్రదించాలన్నారు.

### జీవామృతంతో చీడపీడల నివారణ

పాలసముద్రం: జీవామృతం వినియోగంతో పంటలను ఆశించే చీడపీడలను నివారించవచ్చని, రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం లేదని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్‌సీఆర్‌పీ ప్రతాప్ తెలిపారు. సీఎం కండ్రిగలో గురువారం జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. 100 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి 5 లీటర్ల గోమూత్రం, 5 కిలోల దేశీయ ఆవుపేడ, ఒక కిలో బెల్లం, శనగపిండి, పిడికెడు పుట్టమన్ను, 100 లీటర్ల నీటిలో కలిపి 5 రోజులపాటు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలపాలని సూచించారు. అనంతరం దాన్ని వడగట్టి వచ్చిన ద్రావణాన్ని జీవామృతంగా వినియోగించుకోవచ్చన్నారు. దీన్ని మొక్కలకు వేసుకుంటే ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. సీఎం కండ్రిగలో నిర్మల రైతు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి జీవామృతాన్ని సాగులో ఉన్న పంటలకు ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.



పంటకు అవసరమైన జీవామృతాన్ని తయారుచేస్తున్న రైతులు

# అతిసారం.. ఆందోళనకరం!

- అపోలో ఆస్పత్రిలో విద్యార్థుల అవస్థలు
- ప్రస్తుతం చికిత్స పొందుతున్న 112 మంది
- ఐసీయూలో నలుగురు.. సీఎంసీలో మరొకరు



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కాణిపాకం: అతిసారం బారిన అపోలో విద్యార్థులు కొందరు ఇంకా ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అపోలో విద్యార్థులు అతిసారానికి గురై సొమ్మసిల్లిపడిపోయారు. మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. దీనికి తోడు జ్వరం, తలనొప్పి, ఇతరత్రా నొప్పులు వారిని పట్టిపీడించాయి. సుమారు 300 మంది విద్యార్థులు ఈ వ్యాధి బారిన పడితే వారికి వైద్యులు, జూనియర్ డాక్టర్లు, విద్యార్థులంతా రాత్రంతా కాపలా కాశారు. త్వరగా కోలుకోవాలని దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ ఫలితంగా కొంత మంది ఆస్పత్రిలో చికిత్స పొంది ఉంటే మరికొందరు సురక్షితంగా ఇంటికెళ్లారు. వీరి బాగోగులను అపోలో కాలేజీ నిర్వాహకులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, బాధిత విద్యార్థుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు.

**కొనసాగుతున్న చికిత్స**

నగరంలోని అపోలో మెడికల్ కాలేజీలో మంగళవారం రాత్రి కలుషిత ఆహారం కారణంగా అతిసారం విజృంభించిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం నుంచి విద్యార్థులకు వాంతులు, విరేచనాల తీవ్రత అధికమైంది. దీంతో చాలా మంది విద్యార్థులు చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చేరగా, మరికొందరిని అపోలో కాలేజీలోని చికిత్స అందించారు. సుమారు 300 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని విద్యార్థులు చెబుతున్నారు. అయితే అధికారుల లెక్కల ప్రకారం 257 మంది అతిసారం బారిన పడ్డారు. ప్రస్తుతం 112 మంది చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అపోలో కాలేజీలో 25 మందికి చికిత్స అందుతోంది. ఐసీయూలో నలుగురు ఉండగా, ఇందులో ఒకరికి కాస్త రక్తపు వాంతులయ్యాయని చెబుతున్నారు. మరో విద్యార్థికి ఫిట్స్ రావడంతో సీఎంసీకి తీసుకెళ్లారు. ఆమెకు అక్కడ అన్ని రకాల పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందడంతో సురక్షితంగా డిశ్చార్జ్ అయ్యారు. మరో విద్యార్థికి ఈసీజీ సమస్య వచ్చింది. ఆ విద్యార్థిని తల్లిదండ్రులు వెంటనే చీలాపల్లి సీఎంసీకి తీసుకెళ్లారు.

**పర్యవేక్షణలో అధికారులు**

అతిసారం బారిన పడ్డ విద్యార్థుల విషయంలో ఇటూ అపోలో యజమాన్యం, అటూ జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఆరోగ్య విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి వారి బృందంతో కలిసి పర్యవేక్షిస్తూ, విద్యార్థుల ఆరోగ్య వివరాలను ఆరా తీస్తున్నారు. అపోలోలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూస్తున్నారు.

**ర్యాపిడ్ రెస్పాన్స్ టీం**

తిరుపతికి చెందిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం రంగంలోకి దిగింది. అపోలో కాలేజీ వంటావార్పు గదులను పరిశీలించింది. వారు ఏ రకంగా వంటలు వండిపెడుతున్నారో ఆరా తీసింది. భోజన నాణ్యత, కూరగాయల వాడకాన్ని అడిగి తెలుసుకుంది. తర్వాత తాగునీటి నమూనాలు సేకరించింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థుల వాంతులు, విరేచనాల శ్యాంపిల్స్‌ను సైతం సేకరించింది. విద్యార్థులు ఆహారంలో పురుగులు పడ్డ ఫొటోలు వెలుగులోకి తీసుకొచ్చారు.

### ప్రభుత్వ ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గర్భిణులకు ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం ఉంటుందని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పత్రపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఉచిత వైద్యం అందించేందుకు గ్రామ గ్రామానికి వెళుతున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పేదలకు వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డెంగీ, మలేరియా వంటి ప్రమాదకరమైన వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలు జూనియర్ కళాశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నామన్నారు. కూటమి విద్యార్థుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మున్నా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యేకు 37 ఫిర్యాదులు



ఫోన్‌లో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి 37 ఫిర్యాదులు అందాయి. స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, మేయర్ అముదతో కలిసి ప్రజల నుంచి ఫోన్ ద్వారా పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ట్రాన్స్‌కో, పోలీస్, కార్పొరేషన్, రెవెన్యూ, ఐసీడీఎస్ తదితర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గానికి అభివృద్ధి వైపు తీసుకెళ్లడానికి అందరూ సహకరించాలన్నారు. నగరంలో నీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన అంశాలపై సైతం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ అరుణ, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, గుడిపాల, చిత్తూరు రూరల్‌కు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ‘ఇంటింటికీ కొళాయి’పై సర్వే పూర్తి



కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ఇంటింటికీ నీటి కొళాయిపై సర్వేను సత్వరం పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ఇంటింటికీ నీటి కొళాయి సర్వే, పన్నుల వసూలు, వంద రోజుల్లో హౌసింగ్ ప్రోగ్రాం అంశాలపై సంబంధిత అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తోందని అన్ని వార్డుల్లో సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. వార్డుల వారీగా సమీక్షిస్తూ, ప్రతి ఇంటినీ సర్వే చేసి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. అనుమతి ఉన్న కనెక్షన్లు, అనుమతి లేని కనెక్షన్లు, రికార్డుల్లో ఉన్న క్షేత్రస్థాయిలో కనెక్షన్ లేనివి వంటి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. వార్డు స్థాయిలో మిగిలిన సర్వేను సత్వరం పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై వార్డుల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో డా.అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**సుందరీకరణ పనుల పరిశీలన**

నగరంలోని మురుకంబట్టు సర్కిల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను కమిషనర్ అరుణ గురువారం సాయంత్రం పరిశీలించారు. మురుకంబట్టు సర్కిల్ సుందరీకరణ చర్యల్లో భాగంగా ఐలాండ్‌లో మొక్కల పెంపకం, ఫౌంటెన్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కమిషనర్ వెంట డీఈ వెంకట ప్రసాద్, ఏఈలు, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

**ఇంటి నిర్మాణాలు వేగంగా జరగాలి**

నగరంలోని ప్రభుత్వ లే–అవుట్లలో కొనసాగుతున్న ఇంటి నిర్మాణాల ప్రక్రియ వేగవంతం కావాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. నగరంలోని అనుప్పల్లె లే–అవుట్‌లో గురువారం జరుగుతున్న ఇంటి నిర్మాణాలను పరిశీలించి, స్థానిక సచివాలయ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి కార్పొరేషన్ సహకారం అందిస్తుందని, వంద రోజుల హౌసింగ్ కార్యక్రమంలో పలు దశల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వాళ్లకు రుణాలు ఇప్పించేలా అవగాహన కల్పించాలన్నారు. కమిషనర్ వెంట హౌసింగ్ ఏఈ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## చిరు వ్యాపారులపై కొరడా



బస్టాండు వద్ద చిరు వ్యాపారులను హెచ్చరిస్తున్న అధికారులు

కుప్పం: మున్సిపల్ పరిధిలో రోడ్డుకు ఇరువైపులు నిర్వహిస్తున్న చిరు దుకాణదారులపై అధికారులు ప్రతాపం చూపించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రాజు, అర్బన్ సీఐ జీటీ నాయుడు కలసి పట్టణంలో దుకాణాలు రోడ్డుకు అడ్డంగా నిర్వహించకూడదని హెచ్చరించారు. ప్రధానంగా కడా కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రోడ్లుపై దుకాణాలు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్నేళ్లుగా రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నాం, ఇప్పుడు హఠాత్తుగా దుకాణాలు తొలగిస్తే మాకు జీవనాధారం ఎలా అని వ్యాపారస్తులు బతిమలాడినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కడా కార్యాలయం బయట దుకాణాలను, తోపుడు బండ్లను అక్కడి నుంచి తొలగించాలని అధికారులు ఒత్తిడి చేశారు. పోలీసు యంత్రాగం, మున్సిపల్ సిబ్బంది కలసి దుకాణాలను చుట్టుముట్టడంతో వ్యాపారులు భయభ్రాంతులకు గురయ్యారు. అధికారులకు ఎదురు చెప్పలేక చిల్లర వ్యాపారులు దుకాణాలు ఎత్తివేసి ఇంటిముఖం పట్టారు. తమకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించి, తరువాత మా దుకాణాలు తొలగించి ఉండాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## గాలికుంటు టీకాలతో ఎన్నో ప్రయోజనాలు



మద్దిపట్లపల్లెలో పాడి ఆవులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సహాయకుడు

ఐరాల: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మద్దిపట్లపల్లె పశు వైద్యాధికారి పినాకపాణి అన్నారు. మండలంలోని మద్దిపట్లపల్లె పశు వైద్యశాల పరిధిలో బుధవారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పశువులకు టీకాలు వేసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నాలుగు నెలలకు పైబడిన 3,387 పశువులకు 20వ తేదీ నుంచి గురువారం వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ గాలికుంటు వ్యాధి వలన పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని సూచించారు. ఎద్దులలో పనిచేసే సామర్థ్యం తగ్గుతుందని దీంతో రైతులు ఎంతో నష్టపోతారన్నారు. వర్షాకాల సీజన్‌లో పశువులకు జ్వరం, మేత తినకపోవడం, వణుకు రావడం, పాలు తగ్గిపోవడం, పళ్ల కొరకడం, పెదువుల వాపు, చొంగకారడం, నోటిలో పుళ్లు ఏర్పడిన వెంటనే పాడి రైతులు పశు వైద్యాధికారిని సంప్రదించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు. పాడి రైతులు తప్పనిసరిగా ఈ టీకాలను వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు వేళాయెె!

- టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అవకాశం
- ఈ నెల 28 వరకు గడువు





బంగారుపాళెంలో ఓపెన్ స్కూల్స్ ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు (ఫైల్)

బంగారుపాళెం: చదువుకోవాలని ఆశ ఉన్నప్పటికీ కుటుంబ పరిస్థితులు, పేదరికం కారణంగా చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో బడిమానేసిన యువత, వయోజనులకు చదువుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని తీసుకువచ్చింది. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ)ఆధ్వర్యంలో పది, ఇంటర్ కోర్సులను ఏటా నిర్వహిస్తోంది. కాగా 2024–25 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్‌ల్లో పది, ఇంటర్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు ప్రతి మండలంలోనూ స్టడీ సెంటర్లు ఉన్నట్టు చెప్పారు.

**వారితో సమానంగా..**

ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించిన వారికి ఇచ్చే సర్టిఫికెట్లు, రెగ్యులర్ విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లతో సమానంగా ఉంటుంది. పది పరీక్షలు రాసేవారు ఐదేళ్లలో గరిష్టంగా తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత అవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసేవారు పదోతరగతి పాసై రెండేళ్ల వ్యవధిలో ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తరువాత మిగిలిన ఒక సబ్జెక్టు రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం పదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి పాస్ కాకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

**ప్రవేశానికి దరఖాస్తులు**

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. స్టడీ సెంటర్ల ద్వారా ప్రవేశాలు పొందిన వారంతా చదువుకోవచ్చు. ప్రవేశం పొందేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశం తీసుకోవడానికి ఎలాంటి వయోపరిమితి లేదు. ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా ఓపెన్ స్కూళ్ల కో– ఆర్డినేటర్ రవీంద్ర సూచించారు.

**ఫీజుల వివరాలు**

పదో తరగతికి సంబంధించి జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రూ 1,150, ఇంటర్‌కు సంబంధించి జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1,500 చొప్పున చెల్లించాలి.

| | |
|---|---|
| అడ్మిషన్లు ప్రారంభమైన తేదీ: | 31-07-2024 |
| అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించడానికి గడువు: | 28-08-2024 |
| రూ.200 అపరాధ రుసుంతో ఫీజు చెల్లింపునకు గడువు: | 04-09-2024 |

**రెగ్యులర్ విద్యార్థులకు అవకాశం**

రెగ్యులర్‌గా పాఠశాలలు, కళాశాలల్లో పది, ఇంటర్ చదివి ఉత్తీర్ణత సాధించలేకపోయిన వారు కూడా ఓపెన్ స్కూల్లో చేరి సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ పది, ఇంటర్ కోర్సులు చదివి ఫెయిల్ అయిన నాటి నుంచి పదేళ్ల లోపు ఓపెన్ స్కూల్లో చేరితే రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏదైనా రెండు సబ్జెక్టుల మార్కులు బదలాయించుకునే అవకాశం ఉంటుంది. పదిలో హిందీకి మాత్రం ఈ అవకాశం లేదు.

**సబ్జెక్టుల వివరాలు**

పదో తరగతి గ్రూపు–ఏలో ఇంగ్లీషుతో పాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు బీలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్‌లో గ్రూపు–ఏలో ఇంగ్లీషుతో పాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు బిలో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో పాటు ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకోవచ్చు. ప్రవేశం పొందిన తరువాత స్టడీ మెటీరియల్ అందిస్తారు. ఓపెన్ స్కూల్లో ప్రవేశం పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా స్టడీ సెంటర్లలో 30 తరగతులకు హాజరైన వారికి మాత్రమే మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో జరిగే పరీక్షలకు అనుమతి ఇస్తారు.

**ఓపెన్ స్కూల్ ఓ వరం**

చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ విద్య ఓ వరం. ఈ ఏడాది ఓపెన్ పది, ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఇంటర్నెట్ సెంటర్లు, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి జారీ చేసే సర్టిఫికెట్లు రెగ్యులర్ విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లతో సమానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంటుంది. నిర్దేశించిన గడువులోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలి.

–నాగేశ్వర్‌రావు, ఎంఈఓ, బంగారుపాళెం

**అడ్మిషన్ల పెంపునకు కృషి**

ఓపెన్ స్కూల్ ద్వారా చదివే అభ్యర్థుల అడ్మిషన్లను పెంచేందుకు కృషి చేస్తున్నాం. పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అన్ని శాఖల సమన్వయంతో అడ్మిషన్ల పెంపునకు కార్యాచరణ రూపొందించాం. బడిమానేసిన వారికి, వయోజనులకు ఓపెన్ స్కూల్ సొసైటీని సద్వినియోగం చేసుకోవాలి.

–జనార్దన్‌రెడ్డి, పాఠశాల కో–ఆర్డినేటర్, బంగారుపాళెం

### చిరుధాన్యాలపై అవగాహన

నింద్ర: మండలంలోని అగరంలో అధికారులు రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సజ్జ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు ఇచ్చారు. విత్తన శుద్ధి చేయడంతో రైతులకు మేలు జరిగే అంశాలను వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలను తెలియజేశారు.

### వెన్నశాతం ఉంటే మంచి ధర

పాలసముద్రం: పాలల్లో వెన్నశాతం బట్టి ధర ఉంటుందని శ్రీజ డెయిరీ మిల్క్ ప్రొడ్యూస్ కో–ఆర్డినేటర్ మునిక్రిష్టారెడ్డి తెలిపారు. గురువారం రాచపాల్యంలో ఎంఆర్‌జీ సూపర్‌వైజర్ మారి సమక్షంలో పాల మిత్రాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మునిక్రిష్టారెడ్డి మాట్లాడుతూ పాడిరైతుల నుంచి పాలను సేకరించి, వెన్న శాతాన్ని తప్పకుండా నమోదు చేయాలన్నారు. పాడి పశువులు పెంపకంలో జాగ్రత్తలను వివరించారు. పాలల్లో వెన్న శాతం పెరిగే విధానాలను తెలిపారు. పాడి రైతుల కోసం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన పశుగ్రాసం, ఖనిజ మిశ్రమం కాల్షియంను ఆధునిక శైలిలో అందిస్తున్నామని తెలిపారు. సంవత్సరానికి బోనస్ కూడా కంపెనీ అందిస్తుందని తెలిపారు. చూలు పశువులను ఎక్కువ దూరం నడిపించడం, పరుగెత్తించడం, ఎత్తు ప్రదేశాలకు వెళ్లనివ్వడం, భయపెట్టడం చేయరాదని సూచించారు. ఎంఆర్‌జీ పాడి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ మునిక్రిష్టారెడ్డి